

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 5.13.342
బంగారం: 150 మిల్లీ గ్రాములు
వెండి: 5 గ్రాముల 750 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

మద్యం దుకాణంలో చోరీ



గుణుపూర్‌లోని మద్యం దుకాణం లో చోరీ జరిగింది. ముసుగులు ధరించి చోరీకి పాల్పడ్డారు.

- 8లో



శ్రామిక అవగాహన రథం..

శ్రామిక అవగాహన రథం ప్రారంభమైంది. నెల రోజులు తిరగనుంది.

- 8లో

విపక్షాల విజృంభణ

- సభ వాయిదా



సభలో బడ్జెటు సమావేశాలు (ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో శుక్రవారం రెండో రోజు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా విపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. వివిధ అంశాలపై ప్రతిపక్షాల ప్రతిపాదనలపై సభలో చర్చకు అనుమతించక పోవడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో సభా కార్యకలాపాలు ముందుకు సాగడం అసాధ్యం కావడంతో స్పీకర్ సురమా పాఢి ఆదేశాలతో సభను వరుసగా 2 సార్లు వాయిదా వేశారు. తొలుత ఉదయం 11.30 వరకు, తర్వాత సాయంత్రం 4 గంటల వరకు సమావేశాలు వాయిదా వేశారు. సభ కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష కాంగ్రెస్, బిజూ జనతా దళ్ (బీజేడీ) సభ్యులు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశాయి. పలు ఇతర రంగాల్లో ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాల పట్ల విపక్షాలు సభలో నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

రాష్ట్రంలో అకాల వర్షాలు చేతికి అందాల్సిన పంటని మట్టి కలుపుకున్నాయి. దీంతో రాష్ట్ర రైతాంగం అపారమైన నష్టానికి గురైంది. సకాలంలో ప్రభుత్వ స్పందన కొరవడడంతో పంట నష్టం తాళలేక 14 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ధాన్యం నాణ్యత అంచనాపై బియ్యం మిల్లర్లు అనధికారిక ధర తగ్గింపు చర్యలకు బాహాటంగా పాల్పడిన ప్రభుత్వ చర్యలు శూన్యంగా పరిణమించాయని సభలో విపక్షాలు ఆరోపించాయి. వరి సేకరణలో అక్రమాలపై, రైతుల వెతలపై సభలో చర్చ నిర్వహించాలని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ స్పీకర్‌కు ప్రతిపాదించింది. అయితే, స్పీకర్ విపక్షం ప్రతిపాదనను పెడ చెవిన పెట్టడంతో నిరసన కట్టలు తెంచుకుంది. 'ప్రభుత్వం కష్టాల్లో ఉన్న రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. రైతు సమస్యలపై చర్చలు జరిగే వరకు మా నిరసన కొనసాగిస్తాం' అని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ తెలిపారు.

మండీల్లో వరి కొనుగోలు పురస్కరించుకుని తలెత్తిన అక్రమాలు, అవినీతి అంశంపై చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. బీజేపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆ పార్టీ సభలో నిరసనలు చేపట్టింది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైంది. ఈ శీర్షికపై చర్చ జరగాలని చేసిన ప్రతిపాదనకు అనుమతించక పోవడం అత్యంత విచారకరమని కాంగ్రెసు నాయకుడు సీఎస్ రాజెన్ ఎక్కా తెలిపారు. 'ప్రతిపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ ప్రతిపాదించిన తీర్మానంపై సమాధానం ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాము, కానీ వారు సభలో అంతరాయం కలిగించారు. బీజేడీ, కాంగ్రెస్‌లకు ఎలాంటి శీర్షిక లేదు. వారు తప్పుడు అవగాహనను ప్రేరేపించి ప్రజలను తప్పుదారి పట్టించాలనుకుంటున్నారు' అని బీజేపీ ఎమ్మెల్యే ఇరాసిస్ ఆచార్య వ్యాఖ్యానించారు.

ఆ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోటీశ్వరుడు



బొరిగుమ్మ సమితి చంపుక గ్రామంలో ఒక భవనం

జయపురం: జయపురం సబ్‌డివిజన కొట్‌పాడ్ సమితి బతాసన పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్ ఎస్.పార్థసారథి బిశాయి కోటీశ్వరుడిగా తేలింది. ఈ విషయం అతడి ఆస్తులపై గురువారం విజిలెన్స్ అధికారులు నిర్వహించిన సోదాల్లో వెల్లడైంది. గురువారం రోజంతా 7 స్థానాలలో నిర్వహించిన దాడులలో రూ.2 కోట్ల 45 వేల నగదు, రూ.73 లక్షల 87 వేల విలువైన 16 ప్లాట్లు, రూ.42 లక్షల 19 వేల విలువైన వాహనాలు, పలు పత్రాలు, 19 లక్షల బీమా పత్రాలు, బ్యాంక్ ఖాతాలు సీజ్ చేశారు. అలాగనే ఒక కాజూ మిల్లు, 285 గ్రాముల బంగారు నగలు, 706 గ్రాముల వెండి ఆభరణాలు, విజిలెన్స్ సిబ్బందికి చిక్కాయి. బొరిగుమ్మ పైలా సాహిల్‌లో 4500 చదరపు అడుగుల 3 అంతస్తుల భవనం, బొరిగుమ్మ సమితి చంపుకా గ్రామంలో 2 భవనాలు, 8,561 చదరపు అడుగుల వైశాల్యంలో గల సాయికృష్ణా ఎంటర్‌ప్రైజెస్ కాజు ప్రాసెసింగ్ యూనిట్లను కనుగొన్నారు. ఈ దాడులలో విజిలెన్స్ డివిజన్ అడిషనల్ ఎస్పీలు అరుణ కుమార్ నాయిక్, అనంత ప్రసాద్ మల్లిక్, నలుగురు డీఎస్పీలు కుమార్ ప్రధాన్, సదా జఛీ పాణి, జయశ్రీ ప్రధాన్, ప్రతాప్ కుమార్ అయండి, ఇన్‌స్పెక్టర్లు సంజయ ప్రదాన్, అనుభ దాస్, సంతోష్ బారిక్, సూర్యకాంతి టక్రి,భీమసేన్ పూజారి,ప్రమీళ సునతోపాటు ఆరుగురు ఎస్ఐలు పాల్గొన్నారు. పార్థసారథి గల 16 యేళ్లుగా 2008 లో గ్రామ రోజ్‌గార్ సేవకునిగా చేరి వివిధ పంచాయతీల్లో పనిచేసినట్లు తెలుస్తోంది. 6 నెలల కిందట కొట్‌పాడ్ సమితిలో అకౌంటెంట్‌గా డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పర్మినెంట్ ఉద్యోగి అయ్యాడు. అతి చిన్న ఉద్యోగిగా పనిచేస్తున్న పార్థసారథి కోట్లాది సంపద అందరినీ ఆశ్చర్యపరిచింది.

న్యూస్‌రీల్

మాజీ ఎంపీ జయరాం పంగికి పుత్రికా వియోగం



రాజ్యలక్ష్మి పంగి

కొరాపుట్: కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి కుమార్తె రాజ్య లక్ష్మీ పంగి (21) మృతి చెందారు. శుక్రవారం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రాజ్య లక్ష్మీ పంగి ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. సాయంత్రం పంగి స్వస్థలం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కుందిలిలో అంత్యక్రియలు జరిగాయి.

జింక పిల్ల స్వాధీనం

- చికిత్స పొందుతూ మృతి



స్వాధీనం చేసుకున్న జింకపిల్ల

రాయగడ: గాయాలతో ఉన్న ఒక జింక పిల్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి నారింగితోల గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జింకపిల్ల గాయాలతో గ్రామస్తులకు కనిపించింది. దీన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. రేంజర్ శివశంకర్ మహాపాత్రో జింకపిల్లను చికిత్స చేయించినప్పటికీ జింక మృతి చెందింది. కుక్కలు జింకను గాయపరిచి ఉంటాయని రేంజర్ మహాపాత్రో అనుమానాన్ని వ్యక్తం చేశారు.

డ్యామ్‌లో మునిగి పదేళ్ల బాలుడు మృతి



నీటిలో మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ అమిలిబేధ గ్రామంలో పదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు డ్యామ్‌లో మునిగి చనిపోయాడు. అమిలవిబేధ గ్రామంలో సనియా శిసా కుటుంబం నివాసం ఉంటోంది. సనియా కుమారుడు అబి శిసా (10) తోటి పిల్లలతో ఆడుకునేందుకు వెళ్లి డ్యామ్‌లో దిగి మునిగిపోయాడు. తోటి పిల్లలతో భయంతో పారిపోయారు. స్థానికులు చిత్రకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ ముకుందో మేల్కా ఆదేశాలు మేరకు ఏఎస్ఐ బసంత్ కుమార్ శేఠి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి చూస్తే అబిశిసా అని తెలిసింది. మృతదేహన్ని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

విషం తాగి మహిళ ఆత్మహత్య



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద మితా మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంపీవీ 68 గ్రామంలో మితా విశ్వస్ (28) అనే వివాహిత విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. మితా విశ్వాస్ భర్త పరితోష్ కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఆయన గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి భార్య కనిపించలేదు. చుట్టు పక్కల అంతా గాలించినా ఎక్కడా కనిపించలేదు. రాత్రి ఇంటికి కొద్ది దూరంలో ఓ చెట్టు కింద కూర్చుని కనిపించారు. అప్పటికే ఆమె విషం తాగేసి ఉన్నారు. దీంతో వెంటనే ఆమెను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఆమె మృతి చెందారు. విషయం తెలుసుకున్న కలిమెల పోలీసు ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి కేసు నమోదు చేశారు.

ఏటీఎం ఏర్పాటు చేయండి



నబరంగ్‌పూర్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కోర్టుల సముదాయంలో ఏటీఎం ఏర్పాటు చేయాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ని న్యాయవాదులు కలిశారు. కోర్టులకు నిత్యం కక్షిదారులు, ప్రతి వాదులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు ఇతర శాఖల వారు వస్తుంటారని, ఇక్కడ ఏటీఎం ఏర్పాటు చేస్తే అందరికీ సదుపాయంగా ఉంటుందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో న్యాయవాదులు శేష గిరి రావు,సంతోష్ మిశ్ర,తపన్ సింగ్,దేవి ప్రసాద్ సింగ్,శ్యాం ప్రసాద్ మజ్జి ఉన్నారు.

అన్వేష హాస్టల్ సూపరింటెండెంట్ సస్పెన్షన్




విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: గుసాని సమితి బెత్తగుడ వద్ద అన్వేష ఎస్సీ, ఎస్టీ గర్ల్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ రాజేంద్ర సాహును గురువారం సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తన ఛాంబర్‌లో జరిగిన విలేకరులతో తెలిపారు. మూడురోజుల క్రితం అన్వేష ఆదివాసీ గర్ల్స్ హాస్టల్ (బెత్తగుడ)లో ఒక ఆదివాసీ విద్యార్థినిపై లైంగిక దాడి అభియోగంపై సూపరింటెండెంట్ రాజేంద్ర సాహుపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం కమిటీ ఆయనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంది. ఈ సంఘటన తర్వాత కూడా మరొక విద్యార్థిని హాస్టల్ విడిచి వెళ్లినట్టు సమాచారంపై కూడా కలెక్టర్ తగు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు ఇకముందు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దాస్ అన్నారు.

తండ్రి ఎదుటే కుమారుడి ఆత్మహత్యాయత్నం



రిజర్వాయర్‌లో గల్లంతైన మదన్ జానీ



రిజర్వాయర్‌లో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు

కొరాపుట్: తండ్రి ఎదుట కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొరాపుట్ జిల్లాలో చోటు చేసుకుంది. సునాబెడా మార్గంలో జాతీయ రహదారి 26 పై టింబర్ వంతెన పై నుంచి కొలాబ్ రిజర్వాయర్‌లో మదన్ జానీ (24) దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. చిక్కా పొదర్ గ్రామం నుంచి మదన్ స్కూటీపై కొరాపుట్ వస్తుండగా తండ్రి బైక్ మీద వస్తున్నాడు. అయితే మదన్ అకస్మాత్తుగా స్కూటీ పక్కన పెట్టి రిజర్వాయర్‌లోకి దూకేశాడు. ఇది గమనించిన తండ్రి వెంటనే సునాబెడా పోలీసులకు సమాచారం ఇవ్వగా సిమిలిగుడ అగ్నిమాపక బృందం గాలింపు చర్యలు చేపట్టారు. మదన్ సునాబెడా లో హిందుస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు.

పంట రుణాలపై సమీక్ష



రుణాలపై చర్చిస్తున్న బ్యాంకు అధికారులు

జయపురం: పంట రుణాలపై కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ (కేసీసీ బ్యాంక్) శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించింది. బ్యాంక్ అధ్యక్షులు ఈశ్వర చంద్రపాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంకేయూవై నేతృత్వంలో రైతుల పర్యటనకు, కాఫీ పంటలకు మధ్యంతర రుణాలు ఇచ్చే విషయంపై విస్తృత చర్చలు జరిగాయి. బ్యాంక్ కార్యదర్శి అతుల్య కుమార్ మల్లిక్ వర్క్‌షాపు ప్రాధాన్యతను వివరించారు. బ్యాంక్ సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళో, ఏజీఎం హరిశ్చంద్ర బనగాడి, కొరాపుట్ కాఫీ బోర్డు ఎస్.ఎల్.ఓ ఉపేంద్రసాహు, రైతుల శిక్షణ, జిల్లా పర్యాటక అధికారి తాలీన ప్రధాన్, కొరాపుట్ కాఫీ ట్రస్ట్ ఏడీ అభిషేక్ దాస్, ఏడీ కోల్ జిల్లా కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ సాహు, కొరాపుట్ జిల్లా కాఫీ రైతు అధ్యక్షులు, సభ్యులు, పలువురు కాఫీ రైతులు, వ్యవసాయదారులు, కేసీసీ బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

హబిబుల్లాఖాన్‌కు ఘన నివాళి



హబిబుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కొరాపుట్: దివంగత మాజీ మంత్రి హబిబుల్లాఖాన్ 11వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు... హబిబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హబిబుల్లా ఖాన్ నబరంగ్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఓటమి ఎరుగని నాయకునిగా పేరు తెచ్చుకున్నారని నాయకులు గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్రతిసారి క్యాబినెట్ హోదాలో మూడేసి శాఖలకు మంత్రిగా పని చేశారన్నారు. 2004లో నియోజకవర్గాల పునర్విభజన చట్టం అమల్లోకి రాగా నబరంగ్‌పూర్ అసెంబ్లీస్థానం గిరిజనులకు కేటాయించారు. దీంతో పోటీ చేసే అవకాశం లేక హబిబుల్లా ఖాన్ రాజకీయాల నుంచి విరమణ తీసుకున్నారన్నారు. 2011లో ఖాన్ తుది శ్వాస విడిచారన్నారు. నివాళులు అర్పించిన వారిలో డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శకు వెళ్తున్న మహిళా ప్రతినిధులు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహిళ నాయకులు

కొరాపుట్: అత్యాచార బాధిత కుటుంబాన్ని ప్రతిపక్ష బీజూ జనతాదళ్ మహిళా ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశం మేరకు బాధిత లక్ష్మీపూర్ సమితి పరిడగుడలోని బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బీజేడీ మహిళా నాయకురాలు స్నేహంక చురియా నేతృత్వంలోని బృందం జిల్లా ఎస్పీని కలసి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి పద్మిని దియాన్, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, కౌసల్య హిక్కా తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మ ప్రచారం కోసం..

సైకిల్‌పై ప్రయోగరాజ్‌కు పయనం



ప్రయోగరాజ్‌కు సైకిల్ యాత్ర ప్రారంభించిన ఘాశీ పండ

జయపురం: స్థానిక కొత్తవీధికి చెందిన ఘాశీ పండ సనాతన ధర్మ ప్రచార లక్ష్యంతో సైకిల్‌పై ప్రయోగరాజ్‌కు బయలు దేరారు. శుక్రవారం శ్రీజగత్ జనని మందిరంలోదేవికి పూజలు చేసి సైకిల్‌పై యాత్ర ప్రారంభించాడు. ప్రయోగరాజ్‌లో స్నానం చేసి అక్కడ నుంచి ఆయోధ్యకు వెళ్లి శ్రీరామమందిరాన్ని దర్శించనున్నట్లు వెల్లడించాడు. ప్రజలలో సనాతన ధర్మం ప్రచారం, ప్రసారం చేయటమే లక్ష్యంగా సైకిల్ యాత్ర జరుపుతున్నట్లు పండ వెల్లడించాడు. యాత్రలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తానని తెలిపారు. 1988లో అవిభక్త కొరాపుట్ జిల్లా అంతా సైకిల్ యాత్ర జరిపానని, 2002లో కేరళ రాష్ట్రం శబరి మలైకు సైకిల్ యాత్ర చేశానని, 2018లో రామేశ్వర్ యాత్ర చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

- ఖాళీ బిందెలతో నిరసన
- నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్

రాయగడ: తమ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. నినాదాలు చేస్తూ రాస్తారోకో చేపట్టారు. జిల్లాలోని కాసీపూర్ సమితి శంకరడ గ్రామంలో కొన్నాళ్లుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లేదంటూ గత్యంతరం లేక తామంతా రస్తారోకో చేయాల్సి వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మహిళలు రాయగడ నుంచి కాసీపూర్‌కు వెళ్లే రహదారి మధ్య బైఠాయించారు. వాహనాలు రాకపోకలకు వీలు లేకుండా రహదారిని బంద్‌చేశారు. సుమారు రెండు గంటల పాటు వారంతా ఈ ఆందోళన చేపట్టారు. దీంతో ఆయా రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న అధికారులు వారం రోజుల్లో మంచినీటి సమస్యను మెరుగుపరుస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

విశ్వకల్యాణ భవనం ప్రారంభోత్సవం



ప్రేక్షకులను అలరించిన చిన్నారి నృత్య ప్రదర్శన

జయపురం: జయపురం 326 విజయవాడ–రాంచీ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు సెయింట్ జేవియర్స్ హైస్కూలు ఏనుగు శాల సమీపంలో బ్రహ్మ కుమారీ విశ్వకల్యాణ భవనం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి రాజయోగినీ బ్రహ్మ కుమారి రుక్మిణీ దీదీతో పాటు బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విద్యాలయ మహిళా ప్రభాగ రాష్ట్రీయ సంజోగిణి (కోఆర్డినేటర్)రాజయోగినీ బ్రహ్మ కుమారి శారద జీ హాజరయ్యారు. రుక్మిణీ దీదీ మాట్లాడుతూ ధ్యానం ద్వారా జాతి, జాతీయత, లింగం శారీరక భేదాలు దాటి ముందుకు వెళ్లడమే బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయ ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.



కొవ్వొత్తులతో నూతన ఈశ్వరీయ విశ్వవిద్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అరుదైన చెట్టుపిల్లి గుర్తింపు



సారవకోట: మండలంలోని వడ్డినవలస సమీప పొలాల్లో అరుదైన చెట్టు పిల్లిని గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ ఎస్‌ఎఫ్‌ఓ లక్ష్మీపురం ఈశ్వరరావు, బీట్ అధికారి శివ ప్రసాద్ గ్రామానికి చేరుకుని చెట్టుపిల్లిని సారవకోట సమీపంలో ఉన్న రిజర్వ్ ఫారెస్టులో వదిలారు. అరుదైన అటవీ జంతువులు గ్రామాల్లోకి వస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

ఉద్యోగాల పేరిట మోసం



ధర్నా చేస్తున్న బాధితులు

టెక్కలి రూరల్: తమ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు తీసుకుని మోసం చేశారంటూ సంతబొమ్మాళికి చెందిన పందిరి అప్పన్న, సన్యాసమ్మ దంపతులు శుక్రవారం టెక్కలి గొల్లవీధిలో ధర్నా చేపట్టారు. ఇద్దరు దివ్యాంగు పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి టెక్కలి గొల్లవీధికి చెందిన ఓ మహిళ రూ.18లక్షల 60 వేలు తీసుకుందన్నారు. నేటికీ తిరిగివ్వలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. డబ్బులు తిరిగివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటు సన్యాసమ్మ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. పోలీసులు చొరవతో గొడవ సద్దుమణిగింది. ఇదే విషయమై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. కేసు కోర్టులో ఉందని తెలిపారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



ప్రాబబుల్స్ క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, పీడీలు, కోచ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు శుక్రవారం ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పాత్రునివలస క్రీడామైదానం వేదికగా జరిగిన ఈ ఎంపికలకు సీనియర్స్ మహిళలకు అరకొరగా హాజరుకావడంతో.. కేవలం జూనియర్స్ బాలురకు మాత్రం ఎంపికలు నిర్వహించారు. మొత్తం 45 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులతో కూడిన తుది జాబితాను త్వరలో వెల్లడిస్తామని శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును ఈ నెల 21 నుంచి 23 వరకు కర్నూలు జిల్లా జిల్లా డీఎస్ఏ క్రీడామైదానం వేదికగా జరగనున్న 10వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవిశేఖర్, డి.ఈశ్వరరావు, ఆర్.సతీష్‌రాయుడు, ఎల్.డిల్లేశ్వరరావు, డీఎస్ఏ కోచ్ ఎల్.అనీల్, లక్ష్మణరావు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 24,25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: న్యాయమైన డిమాండ్ల సాధన కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు చేపట్టనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ శ్రీకాకుళం కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని, సిబ్బందిని సకాలంలో నియమించాలని కోరారు. పని ఒత్తిడి పెరగడం, డిజిటలైజేషన్ అందుబాటులో ఉన్నందున వారానికి ఐదు రోజులు మాత్రమే బ్యాంకులు తెరవాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల స్థానంలో శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. 12వ వేతన సవరణలో భాగంగా మిగిలి ఉన్న డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ కృష్ణ కిషోర్, మండ శ్రీనివాసరావు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక అవగాహన రథం ప్రారంభం



శ్రామిక చైతన్య రథాన్ని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ వేద్ధర్ ప్రధాన్ ఇతర అధికారులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అదనపు కలెక్టర్ వేద్ధర్ ప్రధాన్ శ్రామిక అవగాహన రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం జిల్లాలో నెల రోజుల పాటు ఏడు సమితుల్లో తిరుగుతుంది. మల్కన్‌గిరి, మత్తిలి, కోరుకొండ, కలిమెల, చిత్రకొండ, ఖోయిర్‌పూట్, పోడియా సమితుల్లో తిరిగి ప్రభుత్వం అందిస్తున్న శ్రామిక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తుంది. అలాగే బాల కార్మిక విముక్తి, వలస కార్మికుల హక్కులు–బాధ్యతలపై అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో జిల్లా శ్రామిక అధికారి ప్రసన్నకుమార్ పాణిగ్రాహి, దనపు శ్రామిక అధికారిణి పూర్ణిమ దురుకా, బాల సంరక్షణా అధికారి నారాణణ్ దాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన లాంగ్‌డ్రైవ్ సరదా

- హైవేపై అదుపు తప్పిన బైక్
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి.. భార్యకు గాయాలు



మృతుడు అభిషేక్ బెహరా



గాయపడిన అన్నయ్‌పార్థన్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై బైక్‌పై లాంగ్ డ్రైవ్ చేసుకుంటూ గమ్యం చేరాలనుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుటుంబాన్ని విషాదం వెంటాడింది. బైక్ అదుపు తప్పడంతో మృత్యువు వెంటాడింది. భర్త ప్రాణాలు కోల్పోగా.. భార్య గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ బెహరా (40) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బాలాసూర్ కుర్దా నుంచి భార్య అన్నయ్‌పార్థన్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై బెంగళూరు పయనమయ్యాడు. హెల్మెట్‌తో పాటు టూర్ కిట్‌తో సకల జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయం 10.45 గంటలకు ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట పంచాయతీ నవభారత్ నగర్‌కాలనీ సమీపంలోకి వచ్చేసరికి బైక్ స్కిడ్ కావటంతో అభిషేక్ బెహరాకు తీవ్ర గాయాలు కాగా, భార్య అన్నయ్‌పార్థన్ స్వల్పంగా గాయపడింది. స్థానికులు అందించిన సమాచారంతో 108 సర్వీస్ అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం అభిషేక్ బెహరా మృతి చెందారు. అన్నయ్ పార్థన్‌కు ప్రాణాపాయం తప్పింది. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ తల్లి కన్నబిడ్డో..



రైల్వే స్టేషన్ వద్ద దొరికిన నవజాత శిశువు

పర్లాకిమిడి: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఏ తల్లో కని పారేసిన నవజాత శిశువును గురువారం ఉదయం కె.శిరీష అనే మహిళ చూసి కాపాడింది. ఈ సంఘటన రైల్వే స్టేషన్ వద్ద పలువురిని కలచివేసింది. కె.శిరీష అనే మహిళ ఆ నవజాత శిశువును ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి వెంటనే చికిత్స చేయించింది. ఈ నెల 14వ తేదీ తెల్లవారు జామున రైల్వేస్టేషన్ వద్ద ఎవ్వరో ఆడ బిడ్డను వదిలేసినట్టు స్థానికులు అనుమానిస్తున్నారు. శిశువును ప్రభుత్వ కేంద్రాస్పత్రిలో చికిత్స చేసిన అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా శిశు సంరక్షణ అధికారులకు ఆమె అప్పజెప్పింది. జిల్లా శిశు సురక్షా అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి ఆదేశాల మేరకు చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్, నిస్సాం సలోం శిశు దత్తత సంతాన కేంద్రం అధికారులు ఆ నవజాత శిశువును ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాణిపేట శిశు సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి తెలియజేశారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో ఈ నెల 10న పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పిర్ల రామారావు అలియాస్ ముకుందరావును శుక్రవారం డీపీటీసీ డీఎస్పీ ప్రసాదరావు అరెస్టు చేశారు. వడ్డినవలసలోని త్రినాథస్వామి దేవాలయం సమీపంలో రామారావును అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేసి పాతపట్నం కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. కాగా, ముకుందరావు గతంలోనూ గ్రామంలో పలువురిని ఇలాగే వేధించగా దేహశుద్ధి కూడా జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

గంజాయి స్మగ్లర్లు అరెస్టు

- 18 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఒడిశా నుంచి బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



ఇచ్ఛాపురం: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి కర్ణాటకకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం చిక్కమంగుళూరు జిల్లా రాఘవేంద్రనగర్ గ్రామానికి చెందిన ముజామిల్.. ఉప్పలి హిరేకోలలే రోడ్డుకు చెందిన మహ్మద్ సిరాజుద్దీన్‌లు కలిసి బెంగళూరులోని ఇందిరానగర్‌లో నివాసముంటున్నారు. గంజాయికి బానిసయ్యారు. డబ్బు సంపాదనకు గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొన్నారు. ఈ క్రమంలో బెంగళూరులో గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్న విజయ్‌కుమార్‌కు గంజాయి ఇచ్చేందుకు ఒడిశా వెళ్లారు. ఖందమాల్ జిల్లా ఫుల్బాని ప్రాంతానికి చెందిన భరత్ డింఫాల్ వద్ద 18.310 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. బరంపురం నుంచి బస్సులో బయలుదేరి ఇచ్ఛాపురం బస్టాండ్‌కి శుక్రవారం చేరుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా స్టేషన్ సమీపంలో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న ఇచ్ఛాపురం సర్కిల్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు,.

2 కిలోల గంజాయి స్వాధీనం

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ సిబ్బంది క్వార్టర్స్ సమీపంలో 2.080 కిలోల గంజాయితో ముగ్గురిని కంచిలి పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం సుర్లా జంక్షన్‌లో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకు రైలులో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఈ మేరకు కాశీబుగ డీఎస్పీ వి.వెంకట అప్పారావు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన అజిత్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ కోల్‌కతాకు లోడ్‌తో వచ్చినప్పుడు ఒడిషా రాష్ట్రం సుర్లా జంక్షన్ వద్ద టిఫిన్ షాప్ వద్ద ఆపేవాడు. ఈ క్రమంలో బలియాగూడకు చెందిన బొద్ది సోమేశ్‌తో పరిచయం ఏర్పడింది. అక్కడ అతను చాలా మంది డ్రైవర్లు, క్లీనర్లకు గంజాయి అమ్మేవాడు. అజిత్‌కు గంజాయి తాగే అలవాటు ఉండటంతో సోమేష్ వద్ద గంజాయి కొనుక్కొని తాగేవాడు. ఈ క్రమంలో రెండు, మూడుసార్లు కొనుక్కొని చెన్నైకి తీసుకెళ్లేవాడు. అక్కడ చిన్నచిన్న పొట్లాలుగా చేసి అమ్మేవాడు. లాభాలు రావడంతో తన స్నేహితుడు కమలుద్దీన్ కూడా గంజాయి వ్యాపారం చేయాలని ఆశతో అజిత్‌ను అడగ్గా ఇద్దరూ ఈ నెల 11న చెన్నై నుంచి బయలుదేరి 13వ తేదీ వేకువజామున సుర్లా జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ సోమేశ్‌ను కలిసి కేజీ రూ.10వేలు చొప్పున రెండు కేజీల గంజాయి కావాలని కోరారు. అందుకు సోమేష్ ఒప్పుకుని 14వ తేదీ సాయంత్రం సోంపేట రైల్వేస్టేషన్ వద్దకు వస్తే అక్కడ 2 కేజీల గంజాయి అందిస్తానని చెప్పాడు. దీంతో అజిత్, కమలుద్దీన్‌లు 13వ తేదీ రాత్రి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద బసచేసి 14వ తేదీ సాయంత్రం అప్పగిస్తుండగా కంచిలి పోలీసులకు దొరికిపోయారు. కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు, సిబ్బంది దాడి జరిపి నిందితులు సుర్లా జంక్షన్‌కు చెందిన బి.సోమేష్, చెన్నైకు చెందిన అజిత్, కమలుద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, 2.080 కిలోల గంజాయి, నల్లటి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు పాల్గొన్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

గంజాయి పట్టివేత

టెక్కలి రూరల్: టెక్కలి సమీప తోటల్లో శుక్రవారం గంజాయి తాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి కొందరిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. కొంత గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఆదివాసీలపై దాడులు అమానుషం



కాశీబుగ్గలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పలాస: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న సైనిక బలగాల దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమోక్రసీపార్టీతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టుల పేరుతో అడవుల్లో ఉన్న మూలవాసులను తరిమికొట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా చర్యలను దేశ ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.మాధవరావు, సి.పి.ఐ జిల్లా కార్యదర్శి చాపర వేణు, సి.పి.ఐ.ఎం. నాయకులు కోనారి మోహనరావు, లిబరేషన్ నాయకుడు తామాడ సన్యాసిరావు, పత్తిరి దానేసు, జోగి కోదండరావు, సాలిన వీరాస్వామి, మద్దిల ధర్మారావు, కొర్రాయి నీలకంఠం, పోతనపల్లి కుసుమ, బదకల ఈశ్వరమ్మ, బర్ల జానకమ్మ, కోనేరు రమేష్, సార జగన్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల జాబితా విడుదల

రాయగడ: బీజేపీ మండల అధ్యక్షుల జాబితాను పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రతాష్ చంద్ర షాడంగి శుక్రవారం విడుదల చేశారు. రాయగడ జిల్లాలో గల అంబొదల మండలాధ్యక్షుడిగా అనంత మాలదొర, మండల ప్రతినిధిగా రవీంద్ర కుమార్ బిశ్వాల్, బిసంకటక్ మండలాధ్యక్షుడిగా సొమనాథ్ హిమిరిక, మండల ప్రతినిధిగా రామదాస్ ఉలక, దుర్గీ మండలాధ్యక్షునిగా జగన్నాథ పాడీ, మండల ప్రతినిధిగా రాజేంద్ర కుటురుక, కల్యాణసింగుపూర్ మండలాధ్యక్షుడిగా అజిత్ పాణిగ్రహి, ప్రతినిధిగా రామారావు కద్రక, ముకుందపూర్ మండలాధ్యక్షుడిగా మనోజ్ కుమార్ నల్లా, ప్రతినిధిగా అజయ్ కుమార్ మండంగి, మునిగుడ మండలాధ్యక్షుడిగా సుభాష్ గౌడ, ప్రతినిధిగా నారాయణ సరక, రామనగుడ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్ పండా, ప్రతినిధిగా శివప్రసాద్ బ్రహ్మ, డంగాశిలి మండలాధ్యక్షుడిగా పరమేశ్వరి జొడియా, ప్రతినిధిగా కిశోర్ చంద్ర దిసారి, కాసీపూర్ మండలాధ్యక్షుడిగా కమలా లోచన్ నాయక్, ప్రతినిధిగా ఉమాశంకర్ నాయక్, కుంభికొట మండలాధ్యక్షుడిగా మాధవ్ సామల్, ప్రతినిధిగా అమీనా మినియాక, రాయగడ గ్రామీణ (జేకే) మండలాధ్యక్షుడిగా మంగరాజు క్రడక, ప్రతినిధిగా బి.శ్రీనివాస్, రాయగడ మున్సిపాలిటీ మండలాధ్యక్షుడిగా రాజేష్ కుమార్ పాణిగ్రహి, ప్రతినిధిగా టి.మామహేశ్వరరావు, టికిరి మండలాధ్యక్షుడిగా సంతోష్ కుమార్ బెహర, ప్రతినిధిగా బెలధర్ మాఝి నియమితులయ్యారు.

మద్యం దుకాణంలో చోరీ

- రూ.2 లక్షలు దొంగతనం



సీసీ కెమెరాలో గుర్తించిన దుండగులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ పాత బస్టాండ్ వద్ద గల మద్యం దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు తాళాలు విరగ్గొట్టి లోపలకు చొరబడ్డారు. రూ.2 లక్షల నగదును తస్కరించారని బాధితుడు నరేంద్ర సుబుద్ధి గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే మద్యం దుకాణం యజమాని నరేంద్ర సుబుద్ధి గురువారం జరిగిన వ్యాపార లావాదేవీలకు సంబంధించిన డబ్బును క్యాస్ కౌంటర్‌లో ఉంచి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారి అటుగా వెళ్లేవారు చూసే సరికి తాళాలు విరిగి కిందపడి ఉండటంతో దొంగతనం జరిగిందని భావించి దుకాణం యజమానికి తెలియజేశారు. యజమాని వచ్చి దొంగతనంపై పోలీసులు సమాచారం ఇచ్చారు. దొంగతనానికి పాల్పిడిన వారు గునపాంను సంఘటన స్థలం వద్ద విడిచిపెట్టి వెళ్లారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. దొంగతనానికి ముగ్గురు పాల్పడినట్లు గుర్తించారు. వారు ముసుగులు ధరించి ఉన్నట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవ్వడంతో దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



వేదికపై అతిథులు



విజేతలకు బహుమతుల ప్రదానం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి మార్కపల్లి పంచాయతీ థాపాగూడ ఆశ్రమ పాఠశాల మూడో వార్షికో త్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆసరి చాటర్జీ అధ్యక్షత వహించారు. పిల్లలు బాగా చదివి ఉజ్వల భవిష్యత్ కు పునాదులు వేసుకోవాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన లు ఆహూతులను అలరించాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

తాగునీటి ట్యాంకులో వ్యక్తి మృతదేహం

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిఆంధ్ర వీధి సమీపంలో ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచి నీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం బయటపడటం శుక్రవారం కలకలం రేపింది. కె.కొత్తూరు సమీపంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెస్‌లో మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న పాలకొల్లుకి చెందిన చందనాల స్వామి(42) ఈ 12న తన ఊరు వెళ్తానని చెప్పి ద్విచక్రవాహనంపై బయటకు వచ్చేశాడు. ఏం జరిగిందో గానీ శుక్రవారం సాయంత్రం ఆదిఆంధ్రవీధి సమీపంలోని రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలడాన్ని అక్కడి సిబ్బంది గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే ఉన్న ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

946 ఏళ్ల తర్వాత..

చారిత్రక ఉత్సవానికి సన్నద్ధం



శ్రీముఖలింగం ప్రధాన ఆలయం

- 17న శ్రీముఖలింగంలో అనంత వర్మ చోడగంగ దేవుని పట్టాభిషేకం
- సన్నాహాలు చేస్తున్న నిర్వాహకులు



ఒడిశా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్సవాల పోస్టర్



అనంత వర్మచోడ గంగదేవుడి విగ్రహం

జలుమూరు: చారిత్రక ఉత్సవానికి శ్రీముఖలింగం ముస్తాబవుతోంది. నాటి కళింగ సామ్రాట్ అనంత వర్మచోడ గంగదేవుని పట్టాభిషేకం ఉత్సవం 946 ఏళ్ల తర్వాత మరోసారి ఈ నెల 17న ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఒడిశా రాష్ట్రం పర్లాఖిముండి గజపతి రాజభవనం వద్ద నిర్వాహకులు సమావేశమై ఉత్సవాల పోస్టర్ సైతం విడుదల చేశారు. కళింగ రాజధానిగా వెలుగొందిన శ్రీముఖలింగం(కళింగ నగరం) తూర్పు గంగ వంశ పరిపాలనలో గొప్ప ఘనత సాధించింది. ఈ వంశ కాలంలో కళింగ సామ్రాజ్యం ఉత్తరంలో గంగానది నుంచి దక్షిణంలో గోదావరి వరకూ విస్తరించింది. సైనిక, సాంస్కృతిక, శిల్పకళా వైభవంలో కళింగ సామ్రాజ్యం ఓ వెలుగు వెలిగింది.

పూరి మొదలు శ్రీకూర్మం వరకు..

పూరి జగన్నాథ ఆలయానికి చోడగంగదేవుని పాలనలో పునాది పడింది. అయితే నిర్మాణం పూర్తి కాలేదు. తర్వాత వచ్చిన రాజులు దీనిని పూర్తి చేశారు. శ్రీముఖలింగం దేవాలయం మొదటి కామర్ణవ దేవుడు నిర్మించగా అనంత వర్మ వజ్రహస్తకుడు దేవుడు(చోడగంగదేవుని తాత) పూర్తి చేశాడు. చోడ గంగదేవుడు ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశాడు. శ్రీముఖలింగం కళింగ సంస్కృతికి ముఖ్య కేంద్రం. ఇక్కడ శాసనాలు ఆయన పాలన విధానాన్ని వివరింగా చెబుతాయి.

ఇదీ ఘన చరిత్ర

అనంత వర్మ చోడ గంగదేవుడు గంగ వంశాధిపతి. శ్రీముఖలింగం దేవాలయం నిర్మాణానికి బలమైన ఆధారాన్ని అందించిన రాజు. ఇతను తండ్రి దేవేంద్రవర్మ రాజరాజా, తల్లి రాజ రాజాదేవి. ఈమె చోళ రాజ కుమార్తె. గంగ, చోళ వంశాల కలయికలో జన్మించిన చోడగంగదేవుడు చాలా శక్తివంతమైన పరిపాలకుడు. ఇతను తన సామ్రాజ్యాన్ని ఒడిశా,(ఆదికాలంలో కళింగ), ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని ప్రాంతాలను తన నియంత్రణలోకి తెచ్చాడు. బలమైన సైనికుడుగా తన రాజ్యాన్ని స్థిరంగా ఉంచాడు. అంతే కాకుండా యుద్ధవీరుడిగానూ పేరుగాంచాడు. పాలన ప్రారంభంలో కొన్ని కష్టాలు కూడా ఎదురయ్యాయి. చోళ రాజు కులోత్తుంగతో పలు యుద్ధాలు చేశాడు. తిరిగి రాజ్యాన్ని బలపరుచుకొని ఉత్కళ దేశాన్ని సైతం తన గుప్పెట్లో ఉంచుకున్నాడు.

హరిహరుల భక్తుడు..

చోడ గంగదేవుడు జగన్నాథుడి భక్తుడిగా ప్రసిద్ధ చెందారు. శైవభక్తుడిగానూ ప్రసిద్ధుడే. ఇతని శాసనాలలో మధుకేశ్వర దేవాలయానికి పెద్ద మొత్తంలో దానాలు ఇచ్చినట్లు రికార్డులు ఉన్నాయి. కొంతమంది చరిత్రకారులు ఇతను ముందు శైవుడు.. తర్వాత వైష్ణవుడయ్యాడని అంటారు. నిజానికి ఇతను రెండింటికీ ప్రాధాన్యమిచ్చారు. శ్రీకూర్మం(కూర్మనాథస్వామి) ఆలయంతో పాటు ఒడిశాలో అనేక శైవ, వైష్ణ ఆలయాలకు పెద్ద ఎత్తున విరాళాలు అందించారు. 70 ఏళ్లకు పైగా కళింగ రాజ్యాన్ని పరిపాలించిన ఈయన భారతదేశంలో గొప్ప రాజులలో ఒకరిగా నిలిచిపోయారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అనంత వర్మ చోడ గంగదేవుడు పట్టాభిషేకం 946 ఏళ్ల తర్వాత మరోసారి శ్రీముఖలింగంలో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సమర్థవంతమైన పాలన..



అనంత వర్మ చోడ గంగదేవుడు కళింగ రాజ్యాన్ని ఎక్కువ కాలం అంటే సుమారు 70 ఏళ్లకు పైబడి సమర్థంగా పాలించారు. కళింగ రాజ్యంతో పాటు మన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంలో సింహాచలం, శ్రీకూర్మ దేవస్థానం, అరసవల్లి, శ్రీముఖలింగం, ఒడిశాలో కూడా ఎన్నో దేవాలయాలను అభివృద్ధి చేశారు. శ్రీముఖలింగం రాజధానిగా పరిపాలన చేస్తూ కటక్‌ను కూడా రాజధానిగా మార్చి మంచి పాలన అందించారు.

– కొల్లూరి సూర్యనారాయణ, ఆర్కియాలజీ విశ్రాంత ప్రొఫెసర్, ఆంధ్ర యూనివర్సిటీ

నేటి తరాలకు తెలియాలి..



శ్రీముఖలింగం అత్యంత చారిత్రాక, ఆధ్యాత్మిక ప్రదేశం. వేల సంవత్సరాల నాటి పూర్వవైభవం మళ్లీ తెస్తున్నందుకు సంతోషం. దీర్ఘకాలం పాలన చేసిన అనంత వర్మ చోడ గంగ దేవుడు చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పురాతన, మరెన్నో విశేషాలు శ్రీముఖలింగంలో ఉన్నాయి. నాటి కళింగ రాజ్యం రాజధానిగా చేసుకొని పాలన చేసిన రాజు వైభవం పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియనుంది.

– డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, పలాస

క్లుప్తంగా

ప్రతీ రైతుకు యూనిక్ ఐడీ

• జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



రైతులతో మాట్లాడుతున్న తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న ప్రతీ రైతు యూనిక్ ఐడీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు అన్నారు. రాకోడు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నమోదు, సూక్ష్మపోషకాలు రాయితీ, సూక్ష్మ సేద్య పరికరాలు రాయితీ కోసం యూనిక్ ఐడీ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డీడీ జమదాగ్ని, మండల వ్యవసాయ అధికారి గ్రేస్ హార్షలత, వీఏఏ వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ వ్యక్తితో పోలీసులు

గంట్యాడ: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బొండపల్లి మండలం కొత్తపాలేంకు చెందిన కొల్లి పూర్ణచంద్రరావు(అలియాస్ చందు) గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం గింజేరు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అతని నుంచి 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈగా విజయభాస్కర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ విజయభాస్కర్

పార్వతీపురం: ఏపీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలను స్వీకరించిన విజయభాస్కర్ అనంతరం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలనందించి జిల్లా అభివృద్ధికి తోడ్పాడాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న సీఐ

సాలూరు: అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి 19మద్యం బాటిళ్లతో వస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. అధిక మొత్తంలో మద్యం సీసాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

25మందిపై బైండోవర్ కేసులు

సాలూరు: పట్టణంలో ఎరుకుల వీధి, చిన్నహరిజనపేట, బంగారమ్మ కాలనీలో సారా కేసుల్లో ఉన్న వారిని, ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న 25 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్టు పోలీసులు తెలిపారు. తహసీల్దార్ కోర్టులో శుక్రవారం వారిని హాజరుపర్చి ప్రతి ఒక్కరికి రూ.2లక్షల చొప్పున బైండోవర్ చేయడం జరిగిందన్నారు. సారా అమ్మినా, నిల్వ చేసినా, రవాణా చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీటెక్ పాస్ చేయిస్తానని రూ.12లక్షల వసూలు

బొబ్బిలి: పట్టణానికి చెందిన చింతల జయప్రకాష్‌నాయుడు అనే విద్యార్థిని బీటెక్ పాస్ చేయిస్తానని చెప్పి బాత్న చైతన్యకుమార్ పలు దఫాలుగా రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడని పోలీసులకు కొద్ది రోజుల క్రితం ఫిర్యాదు అందింది. సబ్జెక్టుకు కొంతమొత్తం చొప్పున డిమాండ్ చేయడంతో అతని అకౌంట్‌కు జమ చేశామని ఫిర్యాదులో విద్యార్థి పేర్కొన్నాడు. దీనిపై నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని సీఐ కె.సతీష్ కుమార్ విలేకర్లకు శుక్రవారం తెలిపారు.

• మత్స్యకార సొసైటీ ఎన్నికపై సందిగ్ధత
• పట్టించుకోని అధికారులు
• చేపల వేట నిషేధంతో అవస్థలు
• ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

నిర్లక్ష్యం..!



చేపలు వేట సాగించే మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపల వేట సాగిస్తున్న వారంతా నిర్వాసితులే. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తమ భూములను ధారాదత్తం చేసి నిరుపేదలయ్యారు. పోగొట్టుకున్న భూముల్లోనే నిల్వ ఉన్న నీటిలో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్న జీవితాలు వారివి. చేపల వేటే జీవనాధారంగా జీవిస్తున్న వందలాది కుటుంబాల జీవితాల్లో నేడు చీకటి అలుముకుంది. మత్స్యకార సొసైటీ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు మొత్తంలో కొంత మంది చేతివాటం చూపడంతో చేపలు వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు ఎనిమిది నెలల క్రితం ఆదేశాలిచ్చారు. చీకటి అలుముకున్న మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలంటే చేపలు వేట అనివార్యం. అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

సొసైటీ నేపథ్యం..

మడ్డువలస ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఈ మండలంలోని 13 గ్రామాలకు చెందిన రైతులు భూములు ధారాదత్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన రైతులు మత్స్యకార సొసైటీని ఏర్పాటు చేసుకొని వారంతా మత్స్యకారులయ్యారు. అప్పట్లో ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారంతా వంగర మండలం కొట్టిశ గ్రామంలో శ్రీసీతారామా ఫిషర్‌మెన్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 574 మంది సభ్యులున్నారు. వీరంతా ఏటా కొంత లీజు సొమ్మును ప్రభుత్వానికి చెల్లించి చేపలు వేట చేసుకోవడమే ఈ సొసైటీ ముఖ్య ఉద్దేశం.

లీజు సొమ్ము చెల్లించకపోవడంతో వేట నిషేధం

మడ్డువలస ప్రాజెక్టులో చేపలు వేట చేస్తున్న మత్స్యకార సొసైటీ ద్వారా గడిచిన నాలుగేళ్లగా లీజు సొమ్ము చెల్లించకపోవడంతో వేట నిలిపివేశారు. ఈ సొమ్ము చెల్లించాలంటూ పలుమార్లు అధికారులు సొసైటీ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. 1431, 1432, 1433, 1434 ఫసలీలకు చెందిన సుమారు రూ.50 లక్షలు ఈ మత్స్యకార సొసైటీ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే ఇది 2021వ సంవత్సరంలో చెల్లించాల్సిన తొలి ఫసలీకే ఈ నిబంధన తీసుకురావలసిన అధికారులు.. ఇప్పుడు చేపలు వేట నిషేధం అంశం తీసుకురావడం పట్ల వారంతా ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేయించి కోట్లాది రూపాయిల మత్స్య సంపదను తరలించే సమయంలో ఈ లీజు సొమ్మును రాబట్టుకోవాలన్న ఆలోచన మత్స్యశాఖ అధికారుల్లో రాకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పుడు ఏకంగా లీజు మొత్తం రూ.50 లక్షలకు చేరుకోవడంతో ఆ సొమ్ము చెల్లించేందుకు సొసైటీ సభ్యులకు భారంగా మారింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు మొత్తం మత్స్యకార సొసైటీ నుంచి రాబట్టుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. గతంలోనే నిషేధాజ్ఞలు ఇవ్వాల్సిన అధికారులు ఇప్పుడు అమలు చేయడం తగదని మత్స్యకారులు మండిపడుతున్నారు.



వంగర రేవులో నిలిచిపోయిన పడవలు

సొసైటీ ఎన్నికతోనే సమస్య పరిష్కారం

శ్రీసీతారామా ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నిక నిర్వహిస్తే ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. తమకు వేట సాగించే విధంగా ఆదేశాలిస్తే సొసైటీ బకాయిపడిన మొత్తం చెల్లించేందుకు సిద్ధపడతామని పలువురు వెల్లడిస్తున్నారు. వేటను కొనసాగించాలంటే తొలుత సొసైటీ ఎన్నిక నిర్వహించాలన్నది తమ డిమాండ్ అని వారు చెబుతున్నారు. ఈ అంశంపై కలెక్టర్‌తో పాటు ప్రభుత్వం దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

మత్స్యకార సొసైటీ ఇలా..

చేపల వేట సాగిస్తున్న సభ్యులంతా కొట్టిశ శ్రీసీతారామ ఫిషర్‌మెన్ సొసైటీకి చెందిన వారే. వారంతా ఐదు సంవత్సరాలకు ఒక దఫా పాలక వర్గాన్ని ఎన్నుకుంటారు. ఇందులో అధ్యక్షుడు, కార్యదర్శి, ఉపాధ్యక్షుడుతో పాటు మరో ఆరుగురు డైరక్టర్లు ఉంటారు. గతంలో 2019లో ఈ ఎన్నిక జరిగింది. అప్పట్లో నియామకమైన పాలకవర్గం 2024 జూలై నెలతో కాలం ముగిసిపోయింది. అప్పటి నుంచి ఈ సొసైటీకి అధ్యక్షుడు లేకపోవడంతో రాజాం మత్స్య శాఖ కార్యాలయం అసిస్టెంట్ ఫిషరీస్ ఇనస్పెక్టర్‌ను ఆరు నెలలు పాటు పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన పరిపాలన కాలంలో కూడా సొసైటీ ద్వారా ప్రభుత్వానికి రావలసిన రూ.50 లక్షల లీజు మొత్తం సమీకరించడంలో విఫలమయ్యారు.

వలసబాట



మడ్డువలసలో చేపల వేట నిషేధించడంతో పలువురు వలసపోతున్నారు. ఫసలీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు మొత్తం సకాలంలో సమీకరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడమే ఈ పరిస్థితికి దారి తీసింది. ప్రభుత్వానికి బకాయిపడిన లీజులో కొంత సడలింపు ఇస్తే వెసులుబాటు ఉంటుంది. తక్షణమే ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నిక నిర్వహిస్తే లీజు సొమ్ము చెల్లించడానికి ఎన్నికైన పాలక వర్గం ముందుకు వస్తుంది.

– కారు బాలయ్య, మత్స్యకారుడు, వంగర

జీవనోపాధి లేక అవస్థలు



మడ్డువలసలో చేపలు వేట నిషేధించడంతో జీవనోపాధికి అవస్థలు పడుతున్నాం. శ్రీసీతారామా ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నిక నిర్వహిస్తే పాలక వర్గం ఏర్పాటైన తరువాత లీజు సొమ్ము చెల్లించడానికి వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం స్పందించాలి.

– సూరిమల్లి శ్రీను, మత్స్యకారుడు, మగ్గూరు

ఎన్నిక ఎలా నిర్వహిస్తాం

ప్రభుత్వానికి బకాయిపడిన లీజు సొమ్ము చెల్లించకపోతే సొసైటీ ఎన్నిక నిర్వహించలేం. ఇప్పటికే లీజు చెల్లించనందున సొసైటీ సభ్యులకు నోటీసులందించాం. చేపలు వేట చేయవద్దని ఆంక్షలు విధించాం. ప్రస్తుతం ఆ సొసైటీ ఇనాపరేటివ్‌లో ఉంది. లీజు సేకరించడంలో తమ నిర్లక్ష్యం లేదు.

– సీహెచ్‌వీవీప్రసాద్, అసిస్టెంట్ ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్, రాజాం

మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె



నిరసన తెలుపుతున్న బ్యాంకు యూనియన్ నాయకులు, ఉద్యోగులు

విజయనగరం గంటస్తంభం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవాప్తంగా బ్యాంకులు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. మార్చి 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. అలాగే మార్చి 3 తేదీన పార్లమెంట్ ముందు ధర్నా చేసేందుకు నిర్ణయించినట్టు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ తెలిపాయి. బ్యాంకుల్లో తగిన నియామకాలు చేపట్టాలని, 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎస్‌బీఐ ఫోర్ట్ బ్రాంచ్ వద్ద శుక్రవారం వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల అవుట్ సోర్సింగ్ ఆపాలని, యూఎఫ్‌బీయూ, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, దొర, గుప్త, బీవీ ప్రసాద్, మురళీశ్రీనివాస్, రవి, కుమార్, నాగభూషణరావు, అశోక్‌నాయక్, శ్రవణ్, పి.శ్రీనివాసరావు, హరీష్, హరి, భానోజీరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్పీ



పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం టౌన్: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బందికి శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించటానికి గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్పీ భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) సంబంధిత ఫిర్యాదులపై అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం వున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు మృతి



హోంగార్డు పైడిరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

రేగిడి : మండలంలో అక్కన్నఅగ్రహారం గ్రామానికి చెందిన రేగిడి పోలీస్‌స్టేషన్ హోంగార్డు పాదిలావు పైడిరాజు(40) శుక్రవారం మృతి చెందాడు. విధులకు వెళ్తున్న సమయంలో ఉంగరాడ మెట్ట సమీపంలో అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే తను నడుపుతున్న ద్విచక్ర వాహనం పక్కన పెట్టి రోడ్డుపై సేద తీరే ప్రయత్నం చేశాడు. స్థానికులు హోంగార్డు పరిస్థితి గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని హోంగార్డును రాజాం ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈయనకు భార్య రమ్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతి చెందిన విషయం తెలుసుకున్న రేగిడి ఎస్ఐ పి.నీలావతితో పాటు సిబ్బంది గ్రామానికి చేరుకుని పైడిరాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అతని భార్య, కుటుంబీకులను ఓదార్చారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు పక్కా ఏర్పాట్లు

• జేసీ సేతుమాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం ఫోర్ట్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కో ఆర్డినేటింగ్ అధికారులు, లైజినింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విజయనగంలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. అన్ని కేంద్రాల్లోనూ విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ దాట్ల కీర్తి పాల్గొన్నారు.

సిరులతల్లికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పార్చన అలంకరణలో పైడితల్లి అమ్మవారు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించి, తరించారు.

– విజయనగరం టౌన్

పశువైద్య విద్యార్థుల రక్తదానం

• 12వ రోజు కొనసాగిన నిరసన

చీపురుపల్లి రూరల్(గరివిడి):

గరివిడి వెటర్నరీ కళాశాల విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కళాశాల ఆవరణంలో ప్రధాన గేటు వద్ద గత 12 రోజులుగా నిరవధిక దీక్ష చేపడుతున్నారు. 12రోజుల సందర్భంగా దీక్షా శిబిరంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 36 మంది విద్యార్థులు రక్తదానం చేయగా విజయనగరం ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది వారి నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కారం కోసం ఈ నిరవధిక దీక్ష చేపడుతున్నామని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు నిరవధిక దీక్ష కొనసాగిస్తామని పేర్కొన్నారు. పశువైద్య విద్యార్థుల పట్ల చిన్నచూపు చూడటం సరికాదన్నారు. దీక్షా శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యకు కారణం వివాహేతర సంబంధమే...

• ఎస్పీ వకుల్ జిందల్



హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్.. వెనుక ముసుగులో నిందితులు

విజయనగరం క్రైమ్: తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన ఇంజినీరు కోనారి ప్రసాద్ (28) హత్యకు వివాహేతర సంబంధమే కారణమని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ నెల 10న హత్యకు పాల్పడిన అన్నదమ్ములైన ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. హత్య వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, బొబ్బిలి సీఐ నారాయణరావు, తెర్లాం ఎస్ఐ సాగర్ బాబుతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మృతుడు కోనారి ప్రసాద్‌కు నెమలాం గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఇద్దరి మధ్య వాట్సాప్ చాటింగ్‌లను భర్త అచ్యుతరావు గమనించాడు. విషయాన్ని తమ్ముడు శివకృష్ణకు చెప్పాడు. ఇద్దరూ కలిసి ప్రసాద్‌ను అంతమొందించాలని నిర్ణయించారు. బెంగళూరులో పనిచేస్తున్న ప్రసాద్ గ్రామానికి రావడంతో హత్యపథకం అమలుచేయాలని నిశ్చయానికి వచ్చారు. ఆయనతో ముందురోజు మాట్లాడారు. విజయరాంపురంలోని అమ్మమ్మవారి ఇంటికి వెళ్తున్న విషయం, తిరిగి ఏ సమయానికి వస్తాడన్న విషయం తెలుసుకున్నారు. మాట్లాడదామని నెమలాం సమీపంలోని వారి పొలాల వద్దకు పిలిచారు. ప్రసాద్‌తో శివకృష్ణ మాట్లాడుతుండగా వెనుకనుంచి తలపై కర్రతో అచ్యుతరావు బలంగా మోదాడు. తర్వాత ఇద్దరూ కలిసి కర్రలతో దాడిచేశారు. పారిపోయే ప్రయత్నంలో ప్రసాద్ కాలుజారి పిల్లకాలువలోని రాయిపై పడిపోవడంతో అక్కడకు వెళ్లి మరోసారి దాడిచేశారు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృత దేహాన్ని రోడ్డుపై తెచ్చి పడేశారు. అనంతరం బైక్‌ను కూడా కర్రలతో ధ్వంసం చేసి రోడ్డుపై పడేసి ఇంటికి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు తొలుత ప్రమాదంగా అనుమానించారు. ఘటనా స్థలాన్ని చూసి హత్యగా అనుమానించి దర్యాప్తు చేశారు. సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపి నిందితులను పట్టుకున్నారు. కేసును వేగవంతంగా ఛేదించిన బొబ్బిలి డీఎస్పీ, సీఐ, తెర్లాం ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు రేపు

విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న విజ్జి క్రికెట్ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులతో పాటు రిజిస్ట్రేషన్ చేయలేని క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్న అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు దివ్యాంగులు, అంధులు, చెవిటి, మూగ, వీల్‌చైర్ కేటగిరిలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువపత్రాలతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు జిల్లా ఇన్‌చార్జి మహేంద్ర, రాములను 96035 25552, 85009 07015 సంప్రదించాలని కోరారు.

పక్కాగా మాతాశిశు కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

• డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి, గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఆశా నోడల్ అధికారులతో శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు మొదటి త్రైమాసికంలోపే నమోదు, ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలన్నారు. గర్భిణి నమోదు నుంచి ప్రసవానంతరం వరకు, బిడ్డ జన్మించినప్పటి నుంచి మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు.

నిర్ణీత వ్యవధిలో గర్భిణుల ఆరోగ్య తనిఖీలు

నిర్దేశించిన వ్యవధిలో గర్భిణుల ఆరోగ్య తనిఖీలు, బర్త్ ప్లానింగ్ పక్కాగా నిర్వహించాలన్నారు. హైరిస్క్ సమస్యలు ఉన్న వారిని సకాలంలో గుర్తించి నిశితమైన పర్యవేక్షణ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాన్పు సమయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రక్తహీనత సమస్య ఉండరాదని, ఐరెన్ మాత్రలు పౌష్టికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. గిరి శిఖర, మారుమూల గ్రామస్తులకు చెందిన గర్భిణులను ముందస్తుగానే గర్భిణుల వసతిగృహాల్లో చేర్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బిడ్డకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరన్నారు. వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయాలన్నారు. మాతాశిశు వైద్య సేవలన్నీ ఎప్పటికప్పుడు ఆర్సీహెచ్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, అలాగే ఈ-ఆశ యాప్ లాగిన్ అయి వివరాలు ఆశ కార్యకర్తలు నమోదు చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మాతాశిశు మరణాలు సంభవించకుండా కృషి చేయాలన్నారు. డీఐఓ ఎం.నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ కేవీఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్ రావు, పిఎల్.రఘుకుమార్, ఎం.వినోద్, యూపీహెచ్‌సీ వైద్యులు ఉషారాణి, డీపీఓ లీలారాణి, డీఎస్ఓ శంకర్రావు, విజయలత పాల్గొన్నారు.

• రామఫలాల సీజన్ ప్రారంభం



సీతంపేట ఏజెన్సీలో రామఫలాల సీజన్ ఆరంభమైంది. వారపు సంతలు, మార్కెట్‌లో విక్రయానికి గిరిజన రైతులు రామఫలాలు తీసుకువస్తున్నారు. 20 నుంచి 40 పండ్లు ఉండే ఒక్కోగుత్తి రూ.70 నుంచి రూ.80 ధర పలుకుతోంది. ఇదే గుత్తు మైదాన ప్రాంతంలో రూ.200లు ధర పలుకుతుందని వ్యాపారాలు చెబుతున్నారు. రామానగరం, దేవనాపురం గూడలు, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదార, కారెం కొత్తగూడ తదితర ప్రాంతాల రైతులు రామఫలాలను అధికంగా విక్రయిస్తున్నారు.

– సీతంపేట

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

• ఆయుధాల బ్యాగ్ మిస్సింగ్ కేసులో ఎస్పీ చర్యలు

విజయనగరం క్రైమ్ : విజయనగరం కలెక్టరేట్ సమీపంలో 9ఎంఎం కార్బన్ గన్ 30 బుల్లెట్లతో బ్యాగ్ పోగొట్టుకున్న కేసులో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 12న రాత్రి 9 గంటల సమయంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఏఆర్ హెచ్‌సీ విజయనగరం కలెక్టరేట్ సమీపంలో ఆయుధాలతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయారు. సదరు బ్యాగులో 9ఎంఎం కార్బన్ గన్ 30 బుల్లెట్లు ఉన్నాయి. వన్‌టౌన్ పోలీసులు బ్యాగ్ మరిచిపోయిన ప్రదేశానికి వెంటనే వచ్చి తనిఖీ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సమీపంలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ ఫుటేజీలో ఇద్దరు యువకులు ఆ బ్యాగ్‌ను తీసుకున్నట్టు గుర్తించారు. సంబంధిత ఫుటేజీని శుక్రవారం విలేకరులకు విడుదల చేశారు. ఆ యువకులను ఎవరైనా గుర్తిస్తే విజయనగరం వన్‌టౌన్ సీఐ నంబరు 91211 09419, వన్ టౌన్ ఎస్ఐ నంబరు 98496 52747కు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తించిన వ్యక్తికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్టు తెలిపారు. గుర్తించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.